క్లుప్తంగా

ప్రొసీడింగ్ కాపీ అందజేత



ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న జీవన్‌రెడ్డి

రాయికల్: మండలంలోని జగన్నాథపూర్ ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు శనివారం ఎమ్మెల్సీ నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రొసీడింగ్ కాపీని గ్రామ నాయకులకు అందజేశారు.

ఆర్టీసీ బస్సులను ఆదరించాలి



మద్దతు తెలుపుతున్న మహిళలు

బుగ్గారం: ప్రజలు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని విలేజ్ బస్ ఆఫీసర్ మధుకర్ అన్నారు. ఆర్టీసీ సేవలపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో సంస్థ వినూత్నంగా పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా శనివారం మద్దునూర్‌లో స్థానిక మహిళలకు వీబీవో మధుకర్ ఆధ్వర్యంలో ఆర్టీసీ సేవలపై అవగాహన కల్పించారు. ప్రయాణికులను సురక్షితంగా,సుఖవంతంగా గమ్యాలకు చేర్చేది ఆర్టీసీ బస్సులే అన్నారు. అనేక మందికి వివిధ రకాల ఉచిత,రాయితీతో కూడిన బస్ పాస్‌లను అందజేస్తూ సేవా దృక్పథంతో నడుస్తున్న సంస్థ ఆర్టీసీ ఒక్కటేనన్నారు. అటువంటి సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో స్థానిక మహిళా సంఘాల నాయకులు, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ ఆసరాగా ప్రభుత్వం



సీనియర్ సిటిజన్లను సన్మానిస్తున్న నాయకులు

జగిత్యాల: సీనియర్ సిటిజన్స్ సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ముందుకెళ్తున్నారని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ అన్నారు. శనివారం కార్యాలయంలో వయోధికుల రక్షణ, పోషణ సంక్షేమ చట్టం అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చట్టంలోని సెక్షన్ 21 ప్రకారం వయోధికుల ప్రాణాలకు, ఆస్తులకు పోలీస్ శాఖ సంపూర్ణ రక్షణ కల్పించాలన్నారు. అనంతరం కరోనా కాలంలో సేవలందించిన సీనియర్ సిటిజన్లను సన్మానించారు. కార్యక్రమంలో హన్మంతరెడ్డి, యాకూబ్, విజయ్, విశ్వనాథం, కరుణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా దంత పరీక్షలు



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేటలోని సూర్యగ్లోబల్ స్కూల్ విద్యార్థులకు శనివారం దంతవైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ దంత వైద్యులు హర్షవర్ధన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ శరీరంలో అన్ని అవయవాలలో దంతాలు ముఖ్యమైనవన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు, డైరెక్టర్లు హరిచరణ్‌రావు, రజితరావు, మౌనికరావు, సుమన్ రావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల దురుసు ప్రవర్తన

ధర్మపురి: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువులు వారి దురుసు ప్రవర్తనతో అభాసుపాలవుతున్నారు. మండలంలోని మగ్గిడి గురుకుల వసతిగృహంలో విద్యార్థుల సమస్యలను తెలుసుకోవడానికి డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం వెళ్లారు. హాస్టల్‌లో చదువుతున్న శక్తిస్వరూప్ అనే విద్యార్థిని ఉపాధ్యాయులు కాలుతో తన్నారని, మరొకరు కాళ్లు ఒత్తించుకున్నారంటూ రోదిస్తూ తెలిపారు. ఈ విషయంపై లక్ష్మణ్‌కుమార్ మిగతా విద్యార్థులను అడుగగా.. వారు సైతం ఉపాధ్యాయులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. ఈ వ్యవహారం మొత్తం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.



ముత్యంపేటలో నివాళి అర్పిస్తున్న వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు



రాయికల్‌లో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కథలాపూర్‌లో కాంగ్రెస్ నాయకుల నివాళి



పెగడపల్లిలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కోరుట్లలో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహానేతకు ఘన నివాళి

కోరుట్ల: మహానేత దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమంలో పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ గౌడ్, కొంతం రాజం, నాయకులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బ్లాక్, పట్టణ, మండలాధ్యక్షులు అల్లూరి మహేందర్ రెడ్డి, జెట్టి లింగం, తిప్పిరెడ్డి అంజిరెడ్డి తదితరులు వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. కొమొరెడ్డి రామ్‌లు నివాసంలో న్యాయవాది కొమొరెడ్డి కరంచంద్ నివాళి అర్పించారు.

మల్లాపూర్ : వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో ప్రజల సంక్షేమం కోసమే పనిచేశారని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ అన్నారు. శనివారం వైఎస్సార్ జయంతిని సందర్భంగా ముత్యంపేటలో వైఎస్సార్‌టీపీ నాయకులు, వైఎస్సార్ అభిమానులతో కలిసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మండలంలోని ముత్యంపేటలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

కథలాపూర్: మండలకేంద్రంలో మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు.బీమారంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వై ఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని మూటపల్లి, ఇటిక్యాల, రాయికల్ పట్టణంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, వైఎస్సార్ అభిమానులు వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

పెగడపల్లి: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్‌కట్ చేసి వైఎస్ఆర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములుగౌడ్, నంచర్ల సర్పంచి మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రధాని సభకు తరలిన బీజేపీ నాయకులు



సభకు తరలివెళ్తున్న బీజేపీ నాయకులు

మల్లాపూర్: వరంగల్ జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాలలో నిర్వహిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభకు శనివారం మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. బీజేపీ మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు పందిరి నాగరాజు, పట్టణ అధ్యక్షుడు లవంగా శివకుమార్, నాయకులు పుప్పాల మహేష్, మండ స్వామి, ముత్యాల రాకేష్, ఇల్లెందుల మనోజ్‌కుమార్, మండాలోజి విజయ్, తెడ్డు వినోద్, ఇంద్రాల నారాయణ, చిట్యాల లక్ష్మీరాజం, నిమ్మల విజయ్ తదితరులు తరలివెళ్లారు.

కథలాపూర్ మండలం నుంచి..

కథలాపూర్: హనుమకొండలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ బహిరంగసభకు కథలాపూర్ మండలంలోని బీజేపీ నాయకులు శనివారం తరలివెళ్లారు. ఆయా గ్రామాల నుంచి బీజేపీ నాయకులు వాహనాల్లో వెళ్లారు. మండలం నుంచి 200 మంది నాయకులు కార్యకర్తలు వెళ్లినట్లు వారు పేర్కొన్నారు. నాయకులు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, గంద్ర విజయ్‌రావు, పిడుగు ప్రతాప్‌రెడ్డి, బద్రి సత్యం, వెంకటేశ్వర్‌రావు, నవీన సునీల్, తిరుపతి, ప్రతాప్, నరేశ్ తదితరులు సభకు తరలివెళ్లారు.

ఇళ్లు రానివారికి గృహలక్ష్మిలో ప్రాధాన్యం

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

సారంగాపూర్: డబుల్ బెడ్ రూం ఇళ్లు అందని పేదలకు గృహలక్ష్మి పథకంలో మంజూరు చేస్తామని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని పోతారం శివారు గణేశ్‌పల్లిలో ప్రభుత్వం రూ. 1.05 కోట్లతో నిర్మించిన 20 డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ప్రారంభించి మాట్లాడారు. నిరుపేదల ఆత్మగౌరవంతో జీవించడానికి సీఎం కేసీఆర్ డబుల్‌బెడ్ రూం ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టాడని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, ఎంపీపీ కోల జమున, జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి, డీఈ చక్రూనాయక్, తహసీల్దార్ రవీందర్ రావు, ఎంపీడీవో రాజేందర్, ఏఈ సతీష్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గుర్రాల రాజేందర్‌రెడ్డి, సర్పంచ్ డిల్లీ రామారావు, ఎంపీటీసీ జోగినపల్లి సుధాకర్‌రావు ఉన్నారు.

అర్హత లేని, ఇళ్లు ఉన్న వారికి డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇచ్చారని ఎమ్మెల్యే ఎదుట పలువురు నిరసన తెలిపారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల: సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం జగిత్యాలలోని పలువురికి సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లవ్వ, కూతురు రాజేశ్ పాల్గొన్నారు.



డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని, అందులో భాగంగానే గురుకులాలు, మన ఊరు మన బడి కింద అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ధరూర్‌క్యాంప్, ఎస్సీ, ఎస్టీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు బ్లాంకెట్స్, నోట్‌బుక్స్ అందజేశారు. జగిత్యాలలో ఎస్సీ హాస్టల్ త్వరలో ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో వార్డెన్ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ శ్రీలత, నరేశ్, చాంద్‌పాషా పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడిగా గంగాధర్

గొల్లపల్లి: కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా తిర్మలాపూర్(పీడీ) గ్రామానికి చెందిన క్యాస గంగాధర్‌ను నియమిస్తూ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం నియామకపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని, తన నియమాకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నిషాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చట్టప్రకారమే నిందితులపై కేసులు

వెల్గటూర్: చట్ట ప్రకారమే నిందితులపై కేసులు నమోదు చేస్తున్నట్లు ఎస్సై కొక్కుల శ్వేత అన్నారు. చెగ్యాం మాజీ సర్పంచ్ చెన్న పున్నంపై ఇదివరకే నాలుగు కేసులు నమోదయ్యాయని, వీటితో పాటు ఈ నెల 5వ తేదీన చెన్న పున్నం, చెన్న మల్లయ్య ఇద్దరు గొడవ పడగా ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఇరువురిపై చట్ట ప్రకారం కేసు నమోదు నమోదు చేశామని, దర్యాప్తులో భాగంగా ఇరువురినీ అరెస్టు చేసినట్లు ఎస్సై శ్వేత పేర్కొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

రాయికల్: పట్టణంలోని కలమడుగు రాజలింగం గుండెపోటుతో మృతిచెందగా శనివారం అంత్యక్రియల కోసం రాయికల్ లయన్స్‌క్లబ్ సభ్యులు రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కొమ్ముల ఆదిరెడ్డి, డీసీ చౌడారపు లక్ష్మీనారాయణ, కార్యదర్శి మోసారపు శ్రీకాంత్, క్యాషియర్ ప్రవీణ్, సభ్యులు పాల్గొన్నారు.

మల్లాపూర్ : మండలంలోని వేంపల్లిలో శుక్రవారం బజారు రాజవ్వ(90) అనే వృద్ధురాలు అనారోగ్యంతో మృతి చెందగా, సర్పంచ్ బిట్ల సరోజన, ఎంపీటీసీ గుగ్లావత్ భూమి, ఉపసర్పంచ్ వెల్మల రాజనర్సయ్యలతో పాటు వార్డుసభ్యులు బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి, జీపీ నిధుల నుంచి దహన సంస్కారాలకు రూ.10వేల ఆర్థికసాయం అందించారు.

మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు విడుదల చేయాలి

కోరుట్ల: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు అన్నారు. శనివారం ఎంఈవో కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నా లో మాటాడారు. పెంచిన గౌరవ వేతనం రూ.3 వేలతో పాటు పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చకపోతే ఈ నెల 10 వ తేదీ నుంచి సమ్మె చేపడతామన్నారు. కార్యక్రమంలో కార్మికుల సంఘం నాయకులు భాగ్యలక్ష్మి, పద్మ, పోషక్క, సఫియ బేగం, దశరథం, హన్మంతు, భాగ్య,నర్సు, లక్ష్మి, విజయ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం

ధర్మపురి: సాంఘీక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు వసతులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి బాలికల ఉన్నత పాఠశాలతో పాటు మండలంలోని మగ్గిడి సాంఘీక సంక్షేమ గురుకుల వసతి గృహాన్ని శనివారం సందర్శించి మాట్లాడారు. మన ఊరు మన బడి కింద ఎంపికైన ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కనీస వసతులు కరువయ్యాయని గత 20 రోజుల నుంచి తాగునీరు లేక టాయిలెట్స్ లేక విద్యార్థినులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని ఆరోపించారు. అనంతరం మగ్గిడిలోని సాంఘీక సంక్షేమ గురుకుల వసతి గృహాన్ని సందర్శించి అక్కడ విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై అడిగి తెలుసుకున్నారు. వసతి గృహం ప్రహరీ కూలిపోతే ఇప్పటి వరకు నిర్మించలేక పోవడం బాధాకరమన్నారు. వారం లోగా పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ దినేష్, వేముల రాజేశ్, కుంట సుధాకర్, సీపతి సత్యనారాయణ, సుముక్ తదితరులున్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

'అవినీతికి కేరాఫ్ బీజేపీ'

- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కొండగట్టు: భారతీయ జనతా పార్టీ అవినీతికి కేరాఫ్‌గా మారిందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. శనివారం కొడిమ్యాలలో రూ.25 లక్షలతో నిర్మించిన గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్ సర్పంచ్ మమతతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ప్రధాని పర్యటనతో రాష్ట్రానికి ఒరిగిందేం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రం కట్టిన పన్నులు గుజరాత్‌కు తరలించిన ఘనత మోడీదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ స్వర్ణలత జెడ్పీటీసీ ప్రశాంతి వైస్ ఎంపీపీ ప్రసాద్ నాయకులు పునుగోటి కృష్ణారావు మేనేని రాజనర్సింగ రావు, పులి వెంకటేశ్ గౌడ్, నర్సింహరెడ్డి కాయిత రాజు పాల్గొన్నారు.



గ్రంథాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

అరకొర జీతాలతో బతికేదెట్లా?

వెల్గటూర్: కార్లలో తిరిగే ఎమ్మెల్యేలకు అడ్డగోలు జీతాలు ఇస్తూ, గ్రామాల్లో కష్టపడి పారిశుధ్య పనులు చేసే కార్మికులకు అరకొర జీతాలు ఎందుకని బీఎస్పీ ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి నక్క విజయ్ కుమార్ అన్నారు. ఆదివారం వెల్గటూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులకు సంఘీభావం తెలిపి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో కాంట్రాక్టు అనే పదమే ఉండకూడదన్న సీఎం రాష్ట్రం ఏర్పడ్డాక కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే వరకు వారికి బీఎస్పీ అండగా ఉంటుందని మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో ధర్మపురి నియోజకవర్గ బీఎస్పీ అధ్యక్షులు కుషనపల్లి శ్రీనివాస్, వెల్గటూర్, గొల్లపల్లి మండల అధ్యక్షుడు బచ్చల స్వామి, కల్లెపెల్లి తిరుపతి, బచ్చల శైలేందర్ పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న విజయ్ కుమార్

గ్రామైక్య సంఘం సభ్యుల నిరసన

సారంగాపూర్: బీర్‌పూర్ గ్రామ మహిళా సంఘంలో నిధులు దుర్వినియోగానికి పాల్పడిన ఉద్యోగి నుంచి రికవరీ చేయకుండా తిరిగి ఎలా విధుల్లోకి తీసుకుంటారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం బీర్‌పూర్ మండల కేంద్రంలో రోడ్డుపై నిరసన తెలిపారు. బీర్‌పూర్ లోని శ్రీ లక్ష్మీనరసింహ మహిళా సంఘంలో తాము రుణం తీసుకుని డబ్బులు చెల్లించినా, ఇంకా అప్పుగా ఉన్నట్లు రికార్డుల్లో ఉండడం, అప్పు తీసుకోని వారి పేరుపైనా అప్పు ఉండడం వంటి చర్యలపై తాము ఫిర్యాదు చేస్తే అధికారులు విచారణ జరిపి 2022 ఆగస్టు 26న సంబంధిత సిబ్బందిని సస్పెండ్ చేశారని, రూ.11 లక్షలు నిధులు దుర్వినియోగం అయ్యాయని అధికారులు నిర్ధారించారని, ఇప్పటి వరకు రుపాయి రికవరీ చేయకున్నా ఎలా విధుల్లోకి తీసుకుంటారన్నారు. దీనిపై ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు.



బీర్‌పూర్‌లో నిరసన తెలుపుతున్న మహిళలు

పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

మల్లాపూర్: గ్రామ పంచాయతీ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు, పార్ట్‌టైం వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ మండల అధ్యక్షుడు తిప్పనవేని సుధాకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని భరతమాత కూడలి వద్ద నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామ పంచాయతీల్లో ఎన్నో ఏళ్లుగా చాలిచాలనీ వేతనాలతో రాత్రింబవళ్లు విధులు నిర్వర్తిస్తున్న కారోబార్లు, పార్ట్‌టైం వర్కర్ల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. వేతనాలను పంచాయతీ సాధారణ నిధుల నుండి కాకుండా ప్రభుత్వం 010 ఉపపద్దు కింద చెల్లించాలని అన్నారు. గతంలో ఇచ్చిన జీవోలను అమలు చేయాలని డిమాండ్స్‌తో సమ్మెకు దిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ మండల ప్రధాన కార్యదర్శి గడచంద శ్రీనివాస్, కార్యనిర్వహణ అధికారి ముద్దం శ్రవణ్, నాయకులు మామిడి మహేశ్, ఎల్ల నరేశ్, మాట్ల లక్ష్మి, అన్నం రజిత, చిన్నరాజం, పాల్గొన్నారు.

రాయికల్: పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేస్తున్న సమ్మె శనివారం మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులు మాట్లాడుతూ ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజేందర్, ప్రశాంత్, మహిపాల్, జలేందర్, అంజి, నరేందర్, సంపూర్ణ, స్వరూప, స్వామి, శంకర్, ఆశాలు పాల్గొన్నారు.



బీర్‌పూర్‌లో సమ్మె చేస్తున్న కార్మికులు

సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో..

సారంగాపూర్: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గ్రామపంచాయతీల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న సిబ్బంది శనివారం సమ్మె కొనసాగించారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని పంచాయతీ సిబ్బంది తమ సమస్యలను పరిష్కారించాలని కోరారు.

ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

కోరుట్ల: పట్టణానికి చెందిన ప్రైవేట్ ఉపాధ్యాయుడు రాధాకృష్ణపై నమోదైన ఎస్సీ,ఎస్టీ కేసు నమోదుపై మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్ రెడ్డి శనివారం విచారణ చేపట్టారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థినిని టీచర్ కులం పేరుతో దూషించాడని, దీంతో తమ కూతురు ఆత్మహత్యకు యత్నించిందని, విద్యార్థిని తండ్రి పసుల నవీన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు.దీనిపై డీఎస్పీ రవీందర్ రెడ్డి శనివారం ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులను, ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థిని ఇంటికి వెళ్లి ఇరుగు, పొరుగు ఇళ్ల వారితో మాట్లాడి వివరాలు సేకరించారు. డీఎస్పీ వెంట సీఐ ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

ఘనంగా ఆషాఢ మాస బోనాలు

కోరుట్ల: పట్టణంలోని పద్మశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆషాఢ మాసం బోనాల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, భక్తులు బోనాలను ఊరేగింపుగా తీసుకవెళ్లి కోటి నవదుర్గ అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. బోనాల్లో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య, కౌన్సిలర్లు నాగభూషణం, లక్ష్మీనారాయణ, ఆడెపు కమల, రుద్ర సుజాత, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు జక్కుల ప్రసాద్, పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.



రాజారంలో కార్డెన్ సెర్చ్

మల్యాల: మండలంలోని రాజారంలో శనివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ ప్రకాశ్ ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, ఏడుగురు ఎస్సైలు, 60 మంది పోలీసు సిబ్బంది గ్రామంలోని ఇంటింటా తనిఖీ చేశారు. నాటుసారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉన్న బెల్లం పానకంను ధ్వంసం చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని 42 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు.

స్టేట్ లెవల్‌లో కృష్ణవేణి విద్యార్థులు ప్రతిభ

రాయికల్: ఎక్స్‌ప్లోర్ ఒలంపియాడ్ కాంపిటేషన్ పరీక్షల్లో పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు జశ్వంత్ నేషనల్ లెవల్‌లో మొదటి ర్యాంక్, స్టేట్ లెవల్‌లో వికాస్ సెకండ్ ర్యాంక్, వైష్ణిక, కీర్తన్ ప్రతిభ కనబర్చారు. శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో డీఆర్డీవో, శాస్త్రవేత్త కిశోర్‌నేత చేతుల మీదుగా మెమొంటోలు అందుకున్నారు. ఈ సందర్భంగా వీరిని ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రావు అభినందించారు.